సాక్షి నిర్మల్

మంగళవారం : 17 : జూన్ : 2025



.. గోదావరిలో దీపమే! 8లో▸

బాసర వద్ద గోదావరిలో భక్తుల ప్రాణాలకు భద్రత కరువైంది. పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. భద్రత, రక్షణ చర్యలు కానరావడం లేదు.

గిరిజనులకు రెవెన్యూ పట్టాలు

కడెం: కవ్వాల్ టైగర్‌జోన్ పునరావాస గిరిజనులకు రెవెన్యూ పట్టాలు ఇస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 94 మంది లబ్ధిదారుల్లో 78 మందికి పట్టాలు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిగతా 16 మరణించిన, తప్పులు ఉన్న వాటికి త్వరలోనే సరిచేసి ఇస్తామని తహసీల్దార్ ఆర్.ప్రభాకర్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.2 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యోగా వాక్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నిర్మల్‌టౌన్: యోగాతో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణంరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం 'యోగా వాక్' నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారుల గుండా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంవో నారాయణరావు, డాక్టర్ సంధ్యారాణి, డీపీవో శ్రావణ్, డీపీవో నవీన్, ఆయుష్ విభాగం సభ్యులు, ఆశ వర్కర్లు, యోగా శిక్షకురాలు చైతన్య, ప్రదీప్‌పవిత్ర, పరికిపండ్ల స్వదేశ్, ఎస్పీ రవీంద్ర, అడప నవీన్ పాల్గొన్నారు.

విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విజయలక్ష్మి



డీఈవోకు జాయినింగ్ ఆర్డర్ ఇస్తున్న విజయలక్ష్మి

నిర్మల్ రూరల్: జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె.విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గద్వాల జిల్లా విద్యాశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసి పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయలక్ష్మిని డీఈవో రామారావు, సూపరింటెండెంట్ వెంకటరమణ, శ్రావణి, ఎస్‌వోలు సలోమి కరుణ, రాజేశ్వర్, లింబాద్రి అభినందించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ సామర్థ్యాలు సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న ప్రవీణ్‌కుమార్

నిర్మల్ రూరల్: విద్యార్థుల ఎఫ్‌ఎల్‌ఎన్ సామర్థ్యాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త ప్రవీణ్ కుమార్ సూచించారు. శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలను సోమవారం పరిశీలించారు. విద్యార్థుల నమో దు, హాజరు వివరాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను ఒకటో తరగతిలో నమోదు చేయాలని సూచించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్స్ పంపిణీపై ఆరా తీశారు. ఆయన వెంట హెచ్‌ఎం లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యాయురాలు లావణ్య ఉన్నారు.

పండరీపూర్‌కు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

భైంసాటౌన్: పట్టణానికి చెందిన పలువురు భక్తులు సోమవారం పండరీపూర్‌కు పాదయాత్రగా తరలివెళ్లారు. ఏటా ఇక్కడి నుంచి భక్తులు పాదయాత్రగా వెళ్తుంటారు. ఈసారి కూడా పాదయాత్ర ప్రారంభించారు.స్థానిక గీతాకాటన్ వద్ద నుంచి బయల్దేరి వెళ్లగా పారిశ్రామికవేత్త నాగనాథ్ పటేల్ కొబ్బరికాయకొట్టి యాత్ర ప్రారంభించారు. ముందుగా మహారాష్ట్రలోని అలందికి చేరుకుని, అక్కడి నుంచి ఇతర భక్తులతో కలిసి మహాపాదయాత్రగా పండరీపూర్ దేవస్థానానికి చేరుకుంటారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

నిర్మల్ రూరల్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ప్రభుత్వం సోమవా రం విడుదల చేసింది. జిల్లాలో సెకండియర్ విద్యార్థులు 71.71% మంది ఉత్తీర్ణత సాధించగా, ఫస్టియర్ విద్యార్థులు 73.13% పాసయ్యా రు. సెకండియర్ జనరల్ కేటగిరీలో మొత్తం 1,347 మంది విద్యార్థులకు 966 మంది పాస్ అవ్వగా 381 మంది ఫెయిలయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో మొత్తం 238 మంది విద్యార్థులకు 200 మంది పాసవగా 38 మంది ఫెయిలయ్యారు. ఫస్టియర్ జనరల్ కేటగిరీలో మొత్తం 2,985 మంది విద్యార్థులకు 2183 మంది పాసవగా 802 మంది ఫెయిలయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 361 మందికి 270 మంది పాసవగా 91 మంది ఫెయిల్ అయినట్లు డీఐఈవో పరుశురాం వివరించారు. ఈనెల 23 వరకు బోర్డ్ వెబ్‌సైట్‌లో రీకౌంటింగ్, ఆన్సర్‌బుక్ కాపీ, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రీకౌంటింగ్‌కు పేపర్‌కు రూ.100, ఆన్సర్ బుక్ కాపీ, రీవెరిఫికేషన్ కోసం పేపర్‌కు రూ.600 చెల్లించాలని సూచించారు.



నిర్మల్ మెడికల్ కాలేజీ

మెడికల్ కాలేజీపై ఎన్‌ఎంసీ కత్తి..!

- సిబ్బంది కొరత, సమస్యల నేపథ్యంలో..
- రేపు ఢిల్లీకి రావాలని డీఎంఈకి పిలుపు
- ప్రిన్సిపాళ్లతో వర్చువల్‌గా మీటింగ్

నిర్మల్: జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న మెడికల్ కాలేజీపై నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) కత్తి వేలాడుతోంది. వైద్యకళాశాల రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా పాలకుల పట్టింపులేనితనంతో చాలా సమస్యలు అలాగే ఉన్నాయి. కాలేజీ అనుమతి రద్దు చేసేదాకా పరిస్థితి తెచ్చుకోవద్దని ఎన్‌ఎంసీ హెచ్చరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 26 కాలేజీలపై అసంతృప్తి వ్యక్తంచేసింది. ఈనెల 18న నేరుగా హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)ని ఆదేశించింది. డీఎంఈతోపాటు ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు సైతం వర్చువల్‌గా అందుబాటులో ఉండాలని సూచించింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం డీఎంఈ, ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు.

అదే భవనంలో..

రెండేళ్లలో 20 ఎకరాలలో రూ.166 కోట్లతో శాశ్వత మెడికల్ కళాశాల భవనాలు అందుబాటులోకి వచ్చేలా నిర్మాణాలు చేపడతామని మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవ సమయంలో అప్పటి పాలకులు తెలిపారు. రెండేళ్లు గడిచినా.. సెకండియర్ తరగతులు ప్రారంభమైనా భవనాల ఊసులేదు. ఇప్పటికీ కొత్త భవనాలకు అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రస్తుతం భీమన్నగుట్ట పక్కన కొనసాగుతున్న మెడికల్ కాలేజీ భవనం జిల్లా ఆస్పత్రి కోసం కేటాయించింది. ఐదెకరాల స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. అనంతరం జిల్లాకు మెడికల్ కాలేజీ కేటాయించడంతో అదేస్థలంలో రూ.40 కోట్లతో మొదటి సంవత్సరం విద్యార్థులకు సరిపోయేలా, వారి బోధనకు వీలుగా నిర్మాణం మార్చారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరానికి చేరుకున్నా.. కొత్త భవనాల జాడ కనిపించడం లేదు.

బోధనా సిబ్బంది అవసరమే..

ఎన్‌ఎంసీ చేసిన హెచ్చరికల్లో ప్రధానంగా వైద్య విద్యార్థులకు కావల్సిన బోధనా సిబ్బంది లేరన్న విషయం ప్రధానంగా ఉంది. నిర్మల్ మెడికల్ కాలేజీకి సంబంధించి ప్రస్తుతం 62 మంది వైద్యులు ఉన్నారు. రాష్ట్రంలోని మిగతా మెడికల్ కాలేజీలతో పోలిస్తే ఇక్కడ సరిపడా బోధనా సిబ్బంది ఉన్నట్లు చెబుతున్నారు. కానీ.. మున్ముందు ఈ సిబ్బంది సరిపోని పరిస్థితి ఏర్పడుతుంది. ఇక్కడ కనీసం వందమంది ఉండాల్సిన అవసరం ఉంది.

సీఎం సమీక్ష..

ఎన్‌ఎంసీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలోనే మెడికల్ కాలేజీల తీరుపై సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కళాశాలల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కళాశాలల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ వేయాలని సూచించారు. మూడేళ్లలో అన్ని వసతులు సమకూర్చాలని, అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. మరోవైపు బుధవారం డీఎంఈ, ప్రిన్సిపాళ్లతో నేషనల్ మెడికల్ కమిషన్ ఏం మాట్లాడుతుందో.. ఏం చర్యలు తీసుకుంటుందో..అన్న విషయంపైనే కొంత కలవరం నెలకొంది.

హాస్టల్ కొంత ఇబ్బందే..

మెడికల్ కాలేజీకి సంబంధించి ప్రస్తుతం కొనసాగుతున్న భవనం సెకండియర్ వరకు పెద్దగా ఇబ్బంది లేకుండా కొనసాగించవచ్చు. కానీ.. మూడోసంవత్సరంలోకి అడుగుపెడితే ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికీ ఇక్కడ విద్యార్థుల వసతికి కొంత సమస్యగానే ఉంది. బాలురకు కళాశాల భవనంలోనే హాస్టల్ వసతి కొనసాగిస్తున్నారు. బాలికలకు మాత్రం పాలిటెక్నిక్ కళాశాల భవనంలో వసతి ఏర్పాటు చేశారు. ఇద్దరికీ ప్రత్యేకంగా వసతి గృహాలను నిర్మించాల్సిన అవసరం ఉంది.

పెద్దగా ఇబ్బంది లేదు..

రాష్ట్రంలోని మిగతా కాలేజీలతో పోలిస్తే నిర్మల్ వైద్యకళాశాలలో పెద్దగా ఇబ్బందులు లేవు. ఇక్కడ భవనం, సిబ్బంది ప్రస్తుతానికి సరిపడా ఉన్నారు. ఎన్‌ఎంసీతో వర్చువల్ సమావేశానికి హాజరు అవుతాము. – శ్రీనివాస్, ప్రిన్సిపాల్, మెడికల్‌కాలేజీ

ఊరిలోనే నాణ్యమైన విత్తనాలు

- గ్రామాల్లో ఉత్పత్తికి జయశంకర్ యూనివర్సిటీ శ్రీకారం
- నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం పేరుతో కార్యక్రమం
- ప్రతీ రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతుల ఎంపిక
- వరి, కంది, పెసర విత్తనాలు పంపిణీ

మొత్తం వచ్చిన కిట్లు	1188
మొత్తం మండలాలు	19
కందులు	361 బస్తాలు
వరి	355 బస్తాలు
పెసర	334 బస్తాలు



జూన్ 2న నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

నిర్మల్‌చైన్‌గేట్: రైతులు నాణ్యమైన విత్తనాల కొరతను ఎదుర్కొంటున్నారు. ఏటా వేల మంది నాసిరకం విత్తనాలు కొని నష్టపోతున్నారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. అయినా నకిలీ దందా ఆగడం లేదు. అమాయక రైతులను మోసం చేస్తూనే ఉన్నారు. నకిలీ, కల్తీ విత్తనాల వల్ల పంట దిగుబడులు తగ్గి నష్టపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 'నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం గ్రామీణ రైతులతో నాణ్యమైన వరి, పెసర, కంది విత్తనాలు ఉత్పత్తి చేయించి, వాటిని స్థానిక రైతులకు సరసమైన ధరలకు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో రూపొందించబడింది

నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి..

రైతులు నాణ్యమైన విత్తనాలను పొందలేక, ప్రైవేట్ కంపెనీల నకిలీ విత్తనాల కారణంగా పంటలు తెగుళ్లకు గురై, దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన విశ్వవిద్యాలయం, స్థానిక గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసే కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమం రైతులకు నామమాత్రపు ధరలకు నాణ్యమైన విత్తనాలను అందించడంతోపాటు, వారిని స్వయం సమృద్ధిలో భాగస్వాములను చేస్తుంది.

శాస్త్రవేత్తల పర్యవేక్షణ..

ఈ కార్యక్రమంలో రైతులకు అందించిన విత్తనాలను వానాకాలం సీజన్‌లో సాగు చేయిస్తారు. విత్తన శుద్ధి నుంచి పంట దిగుబడి వచ్చే వరకు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నిరంతర పర్యవేక్షణ సాగిస్తారు. నారు పోయడం, నాటు వేయడం, తెగుళ్ల నివారణ వంటి అంశాల్లో రైతులకు సలహాలు, మార్గదర్శకత్వం అందిస్తారు. ఈ ప్రక్రియ నాణ్యమైన దిగుబడిని నిర్ధారిస్తుంది.

గ్రామీణ రైతులకు ప్రయోజనాలు

ఈ కార్యక్రమం ద్వారా ఉత్పత్తి అయిన వరి, పెసర, కంది ధాన్యాలను గ్రామంలోని ఇతర రైతులకు విత్తనాలుగా అందుబాటులో ఉంచుతారు. ఈ విత్తనాలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడిని సాధించవచ్చు. దీనివల్ల వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. అదనంగా, నకిలీ విత్తనాలపై ఆధారపడే అవసరం తగ్గుతుంది. రైతులు నష్టాల నుంచి రక్షించబడతారు.

ఈ కార్యక్రమం రైతుల స్వయం సమృద్ధిని ప్రోత్సహిస్తూ, వ్యవసాయంలో నాణ్యత, విశ్వసనీయతను పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు. స్థానిక గ్రామాల్లో నాణ్యమైన విత్తన ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారా ఈ కార్యక్రమం రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని, వ్యవసాయ ఉత్పాదకతను బలోపేతం చేస్తుంది. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని ఇతర జిల్లాలకు విస్తరించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది.

కార్యక్రమం అమలు..

'నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం' కార్యక్రమం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రారంభించబడింది. ఈ కార్యక్రమం కింద, ప్రతీ రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతులను ఎంపిక చేసి, వారికి వరి, పెసర, కంది విత్తనాలను అందజేస్తారు. ఈ వి త్తనాలను విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు, ఇది నాణ్యతకు హామీ ఇస్తుంది.

జిల్లాలో అమలు: నిర్మల్ జిల్లాలోని 18 మండలాల్లో 396 రెవెన్యూ గ్రామాల నుంచి మొత్తం 1,188 మంది రైతులను ఎంపిక చేశారు. వీరిలో..

355 మందికి 10 కిలోల వరి విత్తన బస్తాలు..
334 మందికి 4 కిలోల పెసర విత్తన బస్తాలు..
361 మందికి 4 కిలోల కంది విత్తన బస్తాలు పంపిణీ చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



గ్రామాల వారీగా ముగ్గురు రైతులను ఎంపిక చేసి నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు పొందవచ్చు. పంట దిగుబడులు వచ్చాక విత్తనాలను మిగతా రైతులకు తక్కువ ధరకు విక్రయించుకోవచ్చు. నకిలీ బెడద తప్పడమే కాకుండా మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు.
– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి



సద్ది కట్టుకుని.. సమస్య చెప్పుకునేందుకొచ్చి..

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిలో తమ సమస్యలను నేరుగా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు చెప్పుకునేందుకు దస్తురాబాద్‌కు చెందిన 50 మంది మత్స్యకారులు భార్య, పిల్లలతో వచ్చారు. వెంట టిఫిన్ బాక్సుల్లో భోజనం తెచ్చుకున్నారు. చేపల వేటకు సంబంధించిన లైసెన్సుల జారీపై కలెక్టర్‌కు విన్నవించారు. సమస్య పరిష్కారానికి కలెక్టర్ హామీ ఇవ్వడంతో బయటకు వచ్చిన మత్స్యకారులు.. కలెక్టరేట్ ఆవరణలోనే వెంటతెచ్చుకున్న సద్దన్నం తిని ఆకలి తీర్చుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

అర్జీలు వేగంగా పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, వేదికపై అదనపు కలెక్టర్లు, ఆర్డీవో

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సమగ్రంగా పరిశీలించి, వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 68 అర్జీలు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి, పరిష్కారంలో జాప్యం చేయొద్దని సూచించారు. శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల స్థితిపై సమీక్షించారు. ప్రతీ దరఖాస్తును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తక్షణమే స్పందించాలన్నారు. వానాకాలం నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం జరుగకుండా చూడాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెత్త బండి రావడం లేదు..



మేము బంగల్‌పేట సమీపంలో ఉన్న నాగనాయి పేట కాలనీవాసులం. ఏడాదిగా మా కాలనీకి చెత్త బండి రావడం లేదు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. ప్రజావాణిలో కూడా రెండుసార్లు ఫిర్యాదు చేశాను. చెత్త బండి రాక రోడ్డుపై వేసిన చెత్తను కోతులు, పందులు చిందరవందర చేస్తున్నాయి. దోమలు, ఈగలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. చెత్త బండి వచ్చేలా చూడండి. – నవీన్, నాగనాయి పేట

నకిలీ నియామక పత్రంతో మోసం..



మాది పెంబి మండలం మందపల్లి గ్రామం. రెండేళ్ల క్రితం ఖానాపూర్ మండలం రాజురాకు చెందిన కొల్పుల హరీశ్ నా కుమారునికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.ఆరు లక్షలు తీసుకున్నాడు. ఆదాయ పన్ను శాఖలో సహాయకునిగా నియమిస్తున్నట్లు చూపించే నియామక పత్రం అందజేశాడు. తనకు పరిచయం ఉన్న చోట కొన్ని రోజులు ఉద్యోగం చేయించి తొలగించారు. గత అక్టోబర్‌లో పెద్దమనుషులను తీసుకెళ్లి న్యాయం అడగగా డబ్బులు జనవరిలో తిరిగి ఇస్తానని కాగితం రాసి ఇచ్చాడు. ఇప్పుడు ఆ డబ్బు అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని బెదిరిస్తున్నాడు. ఇటువంటి వ్యక్తిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలి.
– జిల్ల నర్సయ్య, మందపల్లి

చేపల వేటకు అనుమతి ఇప్పించండి



మేము దస్తురాబాద్ మండలం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులం. 1974 నుంచి చేపల వేటకు లైసెన్సులు పొందుతూ చేపలు పట్టుకుని ఉపాధి పొందుతున్నాం. రాంపూర్‌కు చెందిన మత్స్యకారులు అక్కడ చేపలు పట్టకూడదని మమ్మల్ని కర్రలతో కొట్టి, మా కళ్లలో కారంపొడి చల్లి, గొడ్డళ్లతో దాడి చేస్తున్నారు. 61 కుటుంబాలకు చెందిన మేము ఇదే వృత్తిపై ఆధారపడి ఉన్నాం. రాంపూర్ మత్సకారులపై చట్టరీత్యా చర్య తీసుకుని మాకు చేపల వేటకు అనుమతి ఇప్పించండి.
– దస్తురాబాద్ మత్స్యకారులు

రైతులకు తీపికబురు

- నేటి నుంచి ఖాతాల్లో 'రైతు భరోసా'
- జిల్లాలో 1.50 లక్షల మందికి లబ్ధి
- సుమారు రూ.228 కోట్లు చెల్లించే అవకాశం



లక్ష్మణచాంద: తెలంగాణ ప్రభుత్వం రైతులకు తీపికబురు చెప్పింది. ఖరీఫ్ సాగు పనులు ఇప్పుడిప్పు డే మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున రెండు విడతల్లో రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపింది. ఈ వానాకాలం సీజన్‌కు ఎకరాకు రూ.6 వేల చొప్పున మంగళవారం నుంచి రైతుల ఖాతా ల్లో పెట్టుబడి సాయం జమ చేయనుంది. జిల్లాలోని 1.5 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

రైతులకు సంక్షేమ పథకాలు

రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా, ఎరువులు, విత్తనాలు సకాలంలో సరఫరాతోపాటు, రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ రైతులను ఆదుకుంటోంది. ఈ పథకాలు రైతులకు పంటల సాగులో గణనీయమైన మద్దతు అందిస్తున్నాయి.

అర్హుల వివరాలు సమర్పణ

జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, వానాకాలం సీజన్‌కు రైతు భరో సా పథకానికి అర్హులైన 1.5 లక్షల మంది రైతుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే పంపినట్లు తెలిపారు. జిల్లాలోని 19 మండలాల పరిధిలో ఈ రైతులను గుర్తించామని పేర్కొన్నారు.

రూ.228 కోట్లు జమ

రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 1.5 లక్షల మంది రైతులకు రూ.228 కోట్లు జమ కానున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ తెలిపారు. రైతులు వ్యవసాయ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.

బిల్లుల కోసం బడికి తాళం



పాఠశాలకు తాళం వేసి బైఠాయించిన కాంట్రాక్టర్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్, కాంట్రాక్టర్ గడ్డం శ్రీనివాస్ సోమవారం ఆందోళనకు దిగారు. ఉదయం పాఠశాల ప్రారంభానికి ముందే తాళం వేసి, పెట్రోల్ డబ్బాతో పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరుబయటే ఉండాల్సి వచ్చింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పెంబి ఎస్సై అజయ్, ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకుని, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించాడు.

రూ.23 లక్షల బిల్లులు పెండింగ్

కాంట్రాక్టర్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ, 'మన ఊరు–మన బడి', ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాల కింద రూ.40 లక్షల నిధులతో పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, కిచెన్ షెడ్, ఇతర మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపాడు. ఈ పనులకు రూ.17 లక్షల బిల్లులు మాత్రమే చెల్లించారని, రూ.23 లక్షలు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నాడు. గతంలో కలెక్టర్‌తోసహా సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

అప్పుల భారంతో ఆర్థిక ఇబ్బందులు

పనుల కోసం తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు ఇంట్లోని బంగారం, పశువులు, ఇతర ఆస్తులు విక్రయించినా ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని కాంట్రాక్టర్ వాపోయాడు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి మరోసారి వినతిపత్రం అందించాడు.

భక్తుల భద్రత గోదావరిలో దీపమే!

- ప్రాణాలు పోతున్నా పట్టింపేది?
- కానరాని కనీస రక్షణ చర్యలు
- ఇప్పటికీ ఏర్పాటు చేయని ఇనుప కంచె
- హామీలు నీటి రాతలే!

భైంసా: బాసర వద్ద గోదావరిలో నీటిమట్టం కనిష్ఠ స్థాయికి చేరింది. దీంతో కొన్నిరోజులుగా భక్తులు స్నానఘట్టాల వద్ద కాకుండా నది పొడవున స్నానాలు చేస్తున్నారు. నదిలో అక్కడక్కడ లోతైన ప్రాంతాలు ఉన్నాయని తెలియక స్నానం చేసేందుకు అందులోకి దిగి మృత్యువాత పడుతున్నారు. బాసర వద్ద గోదావరి నదిలో లోతు తెలిపే హెచ్చరిక బోర్డులు లేవు. భక్తులను అప్రమత్తం చేసే సిబ్బంది కూడా ఉండరు. దీంతో భక్తులు గోదావరి నదిలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

పదేళ్ల కాలంలో 127కు పైగా భక్తులు బాసర వద్ద గోదావరిలో నీటమునిగి మృతి చెందారు. 2021లో 10, 2022లో 12, 2023లో 11, 2024లో 10, 2025లో 8 మంది నీట మునిగి మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ అధికారులు తేరుకోవడం లేదు. నదిలో నీటి ప్రవాహం తగ్గిన సమయాల్లోనూ మృత్యువాత పడడం కలచివేస్తుంది. భారీ వర్షాలతో నీటి ప్రవాహం పెరిగిన సమయాల్లో నదిలోకి వెళ్లేందుకు ఎవరైనా జంకుతారు. నీటి సామర్థ్యం తగ్గినప్పుడు స్నానాలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఈనెల 15న ఆదివారం ఆరుగురు యువకులు ఇసుక తెన్నెల నుంచి లోపలికి వెళ్లి స్నానాలు చేశారు. అందులో ఓ యువకుడు ప్రాణాలతో బయటపడగా రాకేశ్, భరత్, మదన్, వినోద్, రితిక్ అనే యువకులు మృతి చెందారు.

ఆరు నెలలైనా...

గోదావరి నదిలో జరుగుతున్న ప్రమాదాలపై జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అప్పట్లో స్పందించారు. గతేడాది డిసెంబర్ 18న భైంసా ఏఎస్పీ అవినాశ్‌తో కలిసి బాసర వంతెన, నది పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. వంతెనలపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు పర్యవేక్షించేలా సిబ్బందిని నియమిస్తామన్నారు. రెండు జిల్లాల పోలీసుల సహకారంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, బ్లూ కోర్టు సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఆరునెలలు గడిచినప్పటికీ ఇప్పటికీ వంతెనపై ఇనుప కంచె ఏర్పాటు చేయలేదు.

స్థానిక యువకులు విన్నవించినా...

దక్షిణ భారతావనిలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర. అందుకే ఇక్కడికి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఇక్కడ తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని 2022లోనే మిషన్ బాసర యువకులు, మేధావులు, యువజన సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి అప్పటి ప్రభుత్వానికి, బాసర ఆలయ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ గోదావరి నదిలో ఏర్పాట్లను ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు.



బాసర వద్ద గోదావరి నది

బాసర గోదావరిని పరిశీలించిన ఎస్పీ

బాసర: బాసర గోదావరినదిని ఎస్పీ జానకీ షర్మిల సోమవారం పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని స్నానఘట్టాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. పుష్కర ఘాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న ఎస్పీ

ఈ ఏర్పాట్లపై దృష్టి సారించాలి

- నదిలోతును తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- ప్రమాదాలు జరిగితే అత్యవసర సేవలు అందించేందుకు అంబులెన్సు, వైద్యులు అందుబాటులో ఉండాలి.
- నది నీటిలో నీళ్లు మింగి ఊపిరాడని పరిస్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేస్తే ప్రాణాలతో బయటపడొచ్చు అనే విషయాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలి.
- గోదావరి నదిలో అన్ని స్నానఘట్టాల వద్దకు భక్తులను అనుమతించవద్దు.
- నది నీటిలోతు తెలుసుకుని ఇనుప కంచెలు ఏర్పాటు చేయాలి.
- బాసర ఆలయంతో పాటు ఆలయ అధికారులు గోదావరి నది సమీపంలో వచ్చే భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించాలి.
- ఆలయానికి రెగ్యులర్ ఈవోను నియమించాలి.
- బాసర నదికి వెళ్లే మార్గంలో, ఘాట్లకు వెళ్లే ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరించే ప్రదేశాల్లో, రాత్రి సమయాల్లోనూ కనిపించేలా వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

భక్తులంతా నదివద్దే...

బాసరకు వచ్చే భక్తులంతా ఎక్కువ సమయం గోదావరి నది వద్దే గడుపుతారు. నదిలో స్నానాలు ఆచరించడం, గంగమ్మ తల్లికి పూజలు చేయడంతో పాటు రెండు వంతెనల పక్కన ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకే ఇష్టపడుతారు. వచ్చిన వారంతా నదిలో కాసేపు విహరించాలని అనుకుంటారు. నదులు ఉన్న పుణ్యక్షేత్రాల్లో వచ్చే భక్తుల కోసం ఎన్నో ఏర్పాట్లు ఉంటే బాసరలో పరీవాహక ప్రాంతాల్లో శుభ్రత పనులు కూడా కనిపించవు. వసంత పంచమి ఏర్పాట్లలో ఘాట్లు, గోదావరి నదీ తీరం అపరిశుభ్రంగా ఉండడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే రామారావు పటేల్ కార్యకర్తలతో వెళ్లి శుభ్రత పనులు చేపట్టారు. ఇక భక్తులకు కావాల్సిన కనీస వసతులు దేవుడెరుగు. ఆహ్లాదం పంచే గోదావరి నదిలో ఆదివారం వరకు బోట్లు తిప్పారు. లైఫ్ జాకెట్లు లేకుండా భద్రత విషయాలు పరిగణలోకి తీసుకోకుండా బోట్లను నదిలోకి పంపారు. ఈ బోట్లలోనే ఆరుగురు యువకులు నీటిలో నుంచి ఇసుక తెన్నెలకు వెళ్లి ప్రమాదాల భారిన పడ్డారు. ఒకే రోజు ఐదుగురు యువకులు గోదావరి నదిలో మృతి చెందడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ అభిలాషఅభినవ్ ఆదేశాలతో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి పరిస్థితిని తెలుసుకున్నారు. సోమవారం నుంచి బోటింగ్‌ను నిలిపివేశారు.

15 వేలకు చేరిన దరఖాస్తులు



బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: ఆర్జీయూకేటీలో ప్రవేశానికి గత నెల 31 నుంచి టీఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జూన్ 21 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించారు. సోమవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 15,015 దరఖాస్తులు వచ్చినట్లు వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ వెల్లడించారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం 1500 సీట్లను కేటాయించింది. జూన్ 21 వరకు ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ట్రిపుల్‌ఐటీ అధికారులు చెబుతున్నారు.

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత



మాట్లాడుతున్న నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ మండల కేంద్రానికి చెందిన అంకుష్ గౌరు (90) వృద్ధాప్యంతో ఆదివారం మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు నారాయణ వృత్తిరీత్యా కండక్టర్ కాగా నిర్మల్‌లో నివాసం ఉంటున్నాడు. తల్లి నిర్మల్‌లో మృతి చెందడంతో సంప్రదాయ బద్ధంగా అంతిమ సంస్కారం నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం మృతదేహాన్ని అప్పగించారు. అవయవదానం, శరీర దానం చేస్తే మెడికోలకు ప్రాక్టీస్‌తో పాటు పేద ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి కేసులో ఒకరి రిమాండ్

జన్నారం: బాలికను కిడ్నాప్‌చేసి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించడంలేదని ఈనెల 1న ఓ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మందపల్లి వాసి మోతే అర్జున్ బాలికను కిడ్నాప్ చేసినట్లు విచారణలో తేలింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితునిపై కిడ్నాప్, రేప్, పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పరిచామన్నారు. జడ్జి నిందితునికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

దాడి కేసులో ఇద్దరు..

దండేపల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బారతపు సత్తవ్వ, ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన బారతపు కుమారస్వామి, లింగయ్య, అమృత, గంగాలక్ష్మి ఈనెల 14న దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా కుమారస్వామి, లింగయ్యను ఆదివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

వాంకిడి: ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని బంబార గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న బైక్‌ను తనిఖీ చేయగా 5 కిలోల పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. మహారాష్ట్రలోని రాజూర తాలూకా సుడక్‌పల్లి గ్రామానికి చెందిన మడావి మోతీరాంను అదుపులోకి తీసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి గోపీకాంత్ సమక్షంలో పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోషెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని దాబా(బి)లో సోమవారం నర్వడే ఈశ్వర్ వద్ద 20 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఏవో భగత్ రమేశ్‌కుమార్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఎస్సై పురుషోత్తం, ఆర్ఐ హుస్సేన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన ఓ యువతి, యువకుడు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 15న యువతి తన స్నేహితురాలి ఇంటికి చదువుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదు. అదే కాలనీకి చెందిన దిగంబర్ మధ్యాహ్నం స్నేహితుడికి ఇంటికి వెళ్తానని చెప్పివెళ్లి తిరిగిరాలేదు. ఇరువురి తల్లిదండ్రులు వేర్వేరుగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

తిర్యాణి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మొర్రిగూడకు చెందిన కుడ్మెత దాదాజి (58) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య సక్కుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

కుభీర్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన వాగ్మరే సాయినాథ్ (26)మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య నిలదీసింది. దీంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి గడ్డెన్న వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు మృతి

ఆదిలాబాద్‌టౌన్: రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ పట్టణ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని రిక్షాకాలనీకి చెందిన సంతోష్‌ను గుర్తు తెలియని రైలు ఢీకొట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గూడ్స్ రైలు పైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫోన్ చోరీకి యత్నించిన యువకుడు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: సెల్‌ఫోన్ చోరీకి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఆదివారం సాయంత్రం ఇందేల్వార్ రాజకుమార్ శర్మ అనే వ్యక్తి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షారుఖ్ ఖాన్ దొంగిలించేందుకు యత్నించాడు. బాధితుడు వెంటనే అప్రమత్తమై నిందితుడిని పట్టుకొని వన్‌టౌన్‌లో అప్పగించాడు.

సైబర్ బాధితులకు నగదు అందజేత

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఈ నెలలో పది కేసుల్లో సైబర్‌క్రైమ్ బాధితులకు తిరిగి డబ్బులు అందించామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఐదుగురు బాధితులు ఎస్పీని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాపల్‌గూడకు చెందిన నర్సింగ్ గతేడాది రూ.16,901 కేవైసీ అప్‌డేట్ లింక్ ఓపెన్ చేయడంతో పోగొట్టుకున్నారని, జైనథ్ మండలానికి చెందిన లింగారెడ్డి గూగుల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ కేర్ సర్వీస్ ఫేక్ నంబర్ ఓపెన్ చేసి రూ.2లక్షల 15వేలు పోగొట్టుకోవడంతో రూ.లక్షా 30వేలు తిరిగి అకౌంట్‌లో వేయించామన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన జి.రమేశ్ ఫ్రాడ్ ఇన్వెస్ట్‌మెంట్‌లో సైబర్ నేరగాళ్లు రూ.లక్షా 59వేలు కాజేయగా రూ.60వేలు ఇప్పించామన్నారు. మావలకు చెందిన మితిలి అనే మహిళ సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ ద్వారా స్నేహితుడిగా సహాయం కోరిన వెంటనే రూ.25వేలు పంపించడంతో తిరిగి వాటిని సైతం ఇప్పించినట్లు తెలిపారు. ఉట్నూర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి స్టాక్ మార్కెట్‌లో దాదాపు రూ.3లక్షలు పోగొట్టుకోగా రూ.50 వేలు కోర్టు ద్వారా అందించినట్లు వివరించారు. సైబర్ క్రైమ్‌కు గురైన బాధితులు వెంటనే 1930, పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.



ఎస్పీని సన్మానిస్తున్న సైబర్ బాధితులు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నిర్మల్ రూరల్: నిర్మల్ మండలం చిట్యాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం....భైంసా పట్టణంలోని అశోక్ నగర్ కాలనీకి చెందిన దివిటికర్ గంగుబాయి ఆమె భర్త బాబు, పింగువ అశోక్, సాయిపుత్ర ప్రజావాణిలో అర్జీలు అందజేసేందుకు ఆటోలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు బయలుదేరారు. చిట్యాల బ్రిడ్జి వద్దకు రాగానే నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టి పంట పొలాల్లో పడిపోయింది. ఆటోలో ఉన్న గంగుబాయి, అశోక్, బాబు, డ్రైవర్ సాయిపుత్రకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. ఎస్సై లింబాద్రి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వ్యాన్ డ్రైవర్ చేతన్ ప్రకాష్ మీనన్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.



గాయపడిన అశోక్



ఆస్పత్రిలో గంగుబాయి

పింఛన్ కోసం మొరపెట్టుకుందామని..

భైంసాటౌన్: పింఛన్ కోసం కలెక్టర్‌కు మొరపెట్టుకుందామని వెళ్లిన వృద్ధ దంపతులతో పాటు వారికి సహాయం చేద్దామని వెళ్లిన ఓ దివ్యాంగుడు, ఆటో నడుపుతున్న డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. భైంసా పట్టణంలోని పిప్రికాలనీకి చెందిన దివిటికర్ గంగుబాయి, ఆమె భర్త బాబు పింఛన్ లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, కలెక్టర్‌కు మొరపెట్టుకుందామనుకున్నారు. సోమవారం ప్రజావాణి ఉండడంతో సహాయంగా దివ్యాంగుడైన అశోక్ పింగ్లేను తోడుగా తీసుకుని ఆటోలో డ్రైవర్‌తో కలిసి నిర్మల్ బయలుదేరారు. నిర్మల్ మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్దకు రాగానే నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న డీసీఎం ఆటోను ఢీకొని ఆటోలోని నలుగురూ తీవ్ర గాయాలపాలయ్యారు. పింఛన్ కోసం అధికారులకు మొరపెట్టుకుందామని బయలుదేరిన వారికి రోడ్డు ప్రమాదం రూపంలో గాయాలే మిగిలాయి.

రెప్పపాటులో.. రెండు ప్రాణాలు

దైవ దర్శనానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్న ఆ కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మరికాసేపట్లో ఇంటికి చేరుకునే క్రమంలో వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి చెట్టును ఢీకొంది. అప్పటివరకు సంతోషంగా గడిపిన వారంతా చెల్లాచెదురయ్యారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఇద్దరు తనువు చాలించారు. ఈ ఘటనలో అమ్మమ్మ, మనుమడు మృతి చెందగా మనవరాలి పరిస్థితి విషమంగా ఉంది. బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- రోడ్డు ప్రమాదంలో అమ్మమ్మ, మనుమడు దుర్మరణం
- ఉట్నూర్‌లోని బీర్సాయిపేట వద్ద చెట్టును ఢీకొట్టిన కారు
- మరో చిన్నారి పరిస్థితి విషమం

ఆదిలాబాద్‌టౌన్/ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఈర్ల రాజు డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో అతని భార్య సృజనిత, కుమారుడు సాహర్ష్(15), కుమార్తె ఆద్యశ్రీతో పాటు సృజనిత తల్లి గంట విజయ(55)తో కలిసి దైవదర్శనం చేసుకునేందుకు శుక్రవారం జిల్లా కేంద్రం నుంచి కారులో బయల్దేరి వెళ్లారు. కాళేశ్వరం, ధర్మపురి, ఇతర దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం బెల్లంపల్లిలో నివాసం ఉంటున్న సృజనిత అక్క ఇంటికి వెళ్లారు. ఆదివారం అక్కడే ఉన్నారు. సోమవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో బయలుదేరారు. మార్గమధ్యలో ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట్ మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. సాహర్ష్, విజయ సంఘటన స్థలంలోనే మృతి చెందగా ఆద్యశ్రీ తలకు తీవ్రగాయాలయ్యాయి. ముందుగా రిమ్స్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. రాజు, సృజనిత గాయాలతో బయటపడ్డారు. కారు డ్రైవర్ రాజుకు కునుకు రావడంతోనే ఈ ప్రమా దం జరిగి ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఉట్నూర్ ఎస్సై మనోహర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



కారులో విజయ మృతదేహం



గంట విజయ (ఫైల్)



ఈర్ల సాహర్ష్ (ఫైల్)

మిన్నంటిన రోదనలు..

రోడ్డు ప్రమాదం విషయం తెలియడంతో బాధిత కుటుంబీకులు, బంధువులతో పాటు కాలనీవాసులు అధికసంఖ్యలో రిమ్స్ ఆస్పత్రితో పాటు వారి నివాసానికి చేరుకుని చేసిన రోదనలు మిన్నంటాయి. ఉన్న ఇద్దరు పిల్లల్లో ఒకరు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా ఏడ్చారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. బడులు ప్రారంభం కావడంతో పిల్లలు తరగతులు నష్టపోతారని హడావుడిగా తీసుకువస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సాహర్ష్ జిల్లా కేంద్రంలోని రిజోనెన్స్ పాఠశాలలో పదో తరగతి, ఆద్యశ్రీ అదే పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం, తోటి స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు.



సంఘటన స్థలంలో కూతురితో సృజనిత

పలువురి పరామర్శ..

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్తకు ఆరేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: భార్యను హత్య చేసిన భర్తకు ఆరేళ్ల జైలు, జరిమానా విధిస్తూ సోమవారం నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం ..2021లో బాసర మండల కేంద్రానికి చెందిన పాలకర్ సాయినాథ్ క్షణికావేశంలో కట్టుకున్న భార్యపై కిరోసిన్ పోసి తగలబెట్టాడు. భార్య చనిపోతూ ఇచ్చిన మరణ వాంగ్మూలంతో పోలీసులు కేసు నమోదు చేసి, పరిశోధన అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ మేరకు జిల్లా జడ్జి శ్రీవాణి నిందితునికి ఆరు సంవత్సరాల జైలుశిక్ష,రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

నేరం చేసిన వారు తప్పించుకోలేరు

నేరం చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ జానకీ షర్మిల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మల్ పోలీసులు ప్రాసిక్యూషన్ వారి వ్యూహంతో న్యాయ విచారణ, నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్ష పడేలా చేస్తారని సూచించారు. నిందితునికి శిక్ష పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు, విచారణ అధికారి ఎస్సై తోట మహేష్, కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్‌ను అభినందించారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా ఎర్గాట్ల మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం బైక్‌పై నిర్మల్‌కు వచ్చారు. తిరుగుప్రయాణంలో కనకాపూర్ చౌరస్తాలో డివైడర్‌ను ఢీకొట్టారు. ఘటనలో రవికి తీవ్రగాయాలు కాగా నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సిర్పూర్(యూ) మండలం పాములవాడకు చెందిన పెందూర్‌శంకర్ తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని, రెబ్బెన మండలం గోలేటికి చెందిన లక్ష్మి తనకు పట్టా ఇప్పించాలని, ఆసిఫాబాద్ మండలం కమ్మర్‌గావ్‌కు చెందిన పృథ్వీరాజ్ తనకు గురుకులంలో అడ్మిషన్ ఇప్పించాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, డీడీ అంబాజీరావు, పీహెచ్‌వో సందీప్, ఏడీ ఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, ఏవో దామోదర స్వామి, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తవ్వకాలు

కడెం: మండలంలోని దోస్తనగర్ సమీపంలో కొండపై వెలసిన శ్రీనల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన వెలుగులోకి వచ్చింది. దస్తురాబాద్‌కు చెందిన అర్చకుడు నరేశాచార్యులు సోమవారం భక్తులు, అర్చకులతో కలిసి ఆలయానికి వెళ్లగా పరిసరాల్లో విరగగొట్టిన ద్వార మూర్తి విగ్రహం, అరబిక్ భాషతో కూడిన ఇత్తడి కడ్డీలు, తట్ట, పార కనిపించాయి. పడేసిన విగ్రహాలకు సంప్రోక్షణ, శాంతిపాఠం, నారసింహ పారాయణం జరిపించి పునఃప్రతిష్ఠించారు. ఒకటి రెండు రోజుల వ్యవధిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు భావించారు.



విరిగిన దేవతామూర్తి విగ్రహం

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కోచ్ ప్రదీప్

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్–19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నిర్వహించారు. రెడ్, గ్రీన్ టీంలకు 50 ఓవర్ల మ్యాచ్‌ను కోచ్ ప్రదీప్, సీనియర్ క్రికెటర్లు గోదావర్తి, చందు ప్రారంభించారు. గ్రీన్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 13.4 ఓవర్లలో 60 పరుగులు చేసి ఆలౌట్ కాగా రెడ్ జట్టు కేవలం 1 వికెట్‌ను కోల్పోయి 11.1 ఓవర్లలో 61 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.